సిరియల్

బొమ్మిడి అచ్చారావు

(గత సంచిక తరువాయి)

కార్తీక్ కాసేపు సంకోచించి చివరికి అన్నాడు.

"మాకు సెలవిస్తే మేము వెళ్తాం సార్! మీకు మా కృతజ్ఞతలు!" అంటూ చేతులు జోడించాడు.

ఆ వ్యక్తి ఫెళ్ళున నవ్వి, "అదేమిటండీ, అంత తొందర? మాంత్రికుడు ఎటుకూడీ చచ్చాడంటున్నారు కదా! ఇక భయం దేనికి? మేము ముగ్గురం ఆయుధాలతో మీతోడున్నాం. జస్ట్, ఆ గుహ సంగతేమిటో చూసి వెళ్ళిపోదాం! కావాలంటే మీకు చివరిదాకా మేం తోడొచ్చి దిగబెడతాం, సరేనా?" అన్నాడు.

అతని మాటలకు నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు వాళ్ళకు. పిల్లికి చెలగాటం ఎలుక్కి ప్రాణసంకటం అంటే యేమిటో ప్రత్యక్షంగా తెలిసివచ్చింది వాళ్ళకు!

వాళ్ళ మనోభావాలతో తనకేం సంబంధంలేదన్నట్టు ఆ వ్యక్తి మళ్ళీ యిలా అన్నాడు. "అయామ్ వెరీ సారీ!

మీరందరు నన్ను మనస్ఫూర్తిగా క్షమించాలి! ఇంతదాకా మమ్మల్ని మేం పరిచయంచేసుకోలేదు చూశారా?

"నా పేరు జయవర్మ. అందరూ వర్మ అని పిలుస్తారు. ఇక్కడికి నలభై కిలోమీటర్ల దూరంలో మా ఊరు సిరిపురం వుంది. సిరిపురంలో చిన్న సైజు జమీందారుగా పిలవబడతాను నేను. వీళ్ళిద్దరు మా పనివాళ్ళు. లవుడు, కుశుడు వీళ్ళ పేర్లు. కవలపిల్లలెండి, అందుకని వాళ్ళమ్మ నాన్న ఆ పేర్లు పెట్టుకున్నారు.

"ఇక్కడికి దగ్గరగా ఓ చిట్టడవి వుంది. అక్కడ సరదాగా వేటాడుతుంటాను నేను. రాత్రి బాగా పొద్దు పోయేవరకు వేటాడాం. ఈ టైగర్ హిల్స్ గురించి వినటమేగాని ఎప్పుడూ చూళ్ళేదు! రాత్రికి ఎటూ సిరిపురం పోవటం లేదుకదా అని యీ కొండమీద విశ్రమిద్దాం అని వచ్చాం. కింద మా జీపు వదిలేసి వచ్చాం. ఇక్కడికొచ్చేసరికి మీరు ఆపదలో చిక్కుకున్నట్టు గ్రహించాం. అదీ విషయం!" అంటూ ముగించాడు—తేనెకళ్ళ వ్యక్తిగా పరిచయమైన జయవర్మ.

అందరూ చెవులప్పగించి అతను చెప్పిందంతా విన్నారు. ఇంత మంచి వ్యక్తిని అనవసరంగా అనుమానించి అపార్థం చేసుకున్నందుకు మనసులోనే నొచ్చుకున్నారు.

వర్మ అందరివంకా పరీక్షగా చూసి "ఏమిటి, ఎవరూ మాట్లాడటం లేదు? ఇంతసేపు చెప్పకుండా సస్పెన్స్‌లో వుంచానని నన్ను తిట్టుకోవటం లేదుకదా!?" అంటూ ఫెళ్ళున నవ్వేశాడు.

అందరి మనసులు తేలికపడ్డాయి.

ముందుగా శాస్త్రిక్ తేరుకుని, "అబ్బెబ్బె, అదేమిటి

సార్ అలా అంటారు? అలా సస్పెన్స్‌లో వుంచి చెప్పటంవల్ల కలిగిన థ్రిల్ నించి యింకా తేరుకోలేక పోతున్నాం, అంతే!" అన్నాడు.

వర్మ దీప్తి వంక చూసి, "ఏమమ్మా, మాంత్రికుడి గుహలోకి రావటానికి మీరు భయపడటం లేదు కదా!" అన్నాడు ఎంతో మర్యాదగా.

దీప్తి వెంటనే తల అడ్డంగా ఊపి, "అబ్బె, భయం లేదండి మీరందరుండగా నాకేం భయం?" అన్నది.

"మీరందరు మనస్ఫూర్తిగా అంగీకరిస్తేనే ఆ గుహలోకి వెళ్దాం. లేకుంటే బలవంతంలేదు. మిమ్మల్ని యీ క్షణం మీ బసకు చేర్చమన్నా సిద్ధం! సంతోషంగా మా లవుడు కుశుడు మీతోడు వచ్చి విడుస్తారు!" అన్నాడు వర్మ.

"ఫరవాలేదు, మీతో గుహలోకి రావటానికి సిద్ధం!" అన్నారు అశ్విని, అభిలాష్, హిమవంత్ ముక్తకంఠంతో.

"థాంక్యూ, థాంక్యూ వెరీమచ్! మిమ్మల్ని కల్సుకో గలిగినందుకు మీ పరిచయం దొరికినందుకు చాలా సంతోషిస్తున్నాను" అన్నాడు వర్మ.

* * *

"ఏడీ మాంత్రికుడు కనిపించడేం?" అయిదో గుహలోకి అడుగు పెడ్తూనే అడిగాడు వర్మ.

"అప్పుడే కాదు సార్, మరి కాస్త దూరం నడిచాక మెట్లు కనిపిస్తాయి, కిందికి. నేలమాళిగ వుంటుంది. అక్కడే దేవతా విగ్రహం, మాంత్రికుడి అతని అనుచరుల శవాలున్నాయి!" అన్నాడు కార్తీక్.

అప్పుడప్పుడు టార్చ్ ఫోకస్ చేస్తేనేగాని లోపలి దృశ్యం కనపడని పరిస్థితి ఏర్పడింది.

"బయట ఎండకూడా వచ్చేవేళయింది. కాని లోపల చీకటిగానే వున్నది" అన్నాడు వర్మ.

మెట్లు దిగి నేలమాళిగలోనికి, సమతల ప్రదేశం చేరారందరు.

కాళికా విగ్రహం యథాస్థానంలోనే వున్నది.

కాని మాంత్రికుడుగాని, అతని అనుచరులుగాని, భరణి శవంగాని—యేవీ లేవక్కడ!

కాంట్రీక్టుతోపాటు అందరూ ఆశ్చర్యంగా అలాగే నిల్చుండిపోయారు!

"ఏమండీ, మాంత్రికుడు చచ్చిపడి వున్నాడన్నారే, యెక్కడా?" అనడిగాడు వర్మ.

అక్కడ నెత్తురుగాని మరేవిధమైన ఆనవాళ్ళుగాని లేవు! అసలు అంతక్రితం రోజు అక్కడ పెద్ద హడావిడి జరగటం, మారణ హోమాలు జరగటం చెపితే హాస్యాస్పదంగా వున్నట్టనిపిస్తుంది. అక్కడ అలాంటి సూచనలేమీ లేవు!

కాంట్రీక్టుతోబాటు అందరి మెదళ్ళను తొలచివేసే ప్రశ్న అదే!

"ఏదో చూసి యేదో అనుకుని భయపడి వుంటారు! ఈ రోజుల్లో మాంత్రికుడు, భూతప్రేతా లేమిటండీ, అంతా ఉత్తది!" అన్నాడు వర్మ.

"మంత్రాలు, తంత్రాలు ఉత్తదయితే కావచ్చుగాని, మేము, మాంత్రికుడు అతని యిద్దరు అనుచరులు చచ్చిపడుంటం కళ్ళారా చూశాం! పక్కనే మా డ్రయివరు భరణి కూడా శవరూపంలో పడున్నాడు. ఇంతలో చిత్రంగా అన్ని శవాలు మాయమైపోయాయి. మాకే నమ్మబుద్ధి కావటంలేదు!" అన్నాడు కాంట్రీక్ట్!

అనుచరుల శవాలు కూడా చిత్రంగా మాయ
మయ్యాయే! ఎలా జరిగింది?

"సరే, యింకా లోపలికి పోదాం, రండి!" అన్నాడు వర్మ. విగ్రహం పక్కనుంచి దారితీశాడు కార్తీక్. అతని వెనక వర్మ, లవుడు కుశుడు వాళ్ళిద్దరి వెనక అభిలాష్, దీప్తి, హిమవంత్, అశ్విని నడుస్తున్నారు.

"ఇదేమిటి, యిక్కడ పాములు చచ్చిపడున్నాయి. ఎవరో రివాల్వర్‌తో కాల్చినట్టు కనిపిస్తోంది" అన్నాడు వర్మ మోకాళ్ళమీద వంగి పాములవంక పరిశీలనగా చూస్తూ.

కార్తీక్ గాని, యింకెవరుగాని మాట్లాడలేదు.

దూరంగా పచ్చటి వెలుగు పడుతోంది. భూగృహం లోపలి భాగంలోనికి వెలుగు ఎలా వస్తోందోనని ఆశ్చర్యంగా చూస్తున్నాడు వర్మ.

ఇంతక్రితం చూసిన వెలుగే అది! ఆ వెలుగును సమీపిస్తూంటేనే యేదో వింత శబ్దాలు గాల్లో వినిపించాయి యిదివరకు.

అందరు చెవులు రిక్కించి నడుస్తున్నారు.

గాల్లో ఎలాంటి శబ్దమూ లేదు!

వర్మ నవ్వుతూ హిమవంత్ వంక చూశాడు. 'వర్మ అలా చూసినపుడల్లా అతనికి ఉక్రోషం వచ్చేస్తోంది.

"ఆగండి!" అన్నాడు వర్మ చటుక్కున ఆగిపోయి.

లవుడు, కుశుడు తుపాకులు సిద్ధంగా పట్టుకున్నారు. వర్మ చేతిలో రివాల్వర్ ఏ క్షణంలోనైనా పేలటానికి సిద్ధంగా వున్నట్టుంది!

కార్తీక్ బృందం ఊపిరిబిగబట్టి చూస్తున్నారు.

ఎక్కడో సన్నగా అలికిడి వినపిస్తోంది. యెవరో

తిరుగుతున్న చప్పుడు. అడుగుల సవ్వడి బరువుగా నేలని తాకుతున్న సవ్వడి!

హిమవంత్ కళ్ళెగరేశాడు. వర్మ అతన్ని చూసి అంత సీరియస్ పరిస్థితిలోను నవ్వుకున్నాడు సన్నగా.

వర్మ లవుడు కుశుడువైపు చూసి జాగ్రత్తగా వుండమన్నట్టు సైగ చేశాడు!

ఎలాంటి సంఘటనా ఎదురుకాలేదు!

వర్మ ముందుకి కదిలాడు. అతనితో బాటు లవుడు కుశుడు కదిలారు. వారివెంట కార్తీక్ బృందం కదిలారు.

అక్కడ జారుడు అంతగా లేదు. ఇరుకుదారి విశాలంగా తయారయింది. పైన బాగా ఎత్తున బిలంతొలిచిన పైకప్పుంది. అంత విశాలమైన భూగృహాలుంటాయని వాళ్ళెన్నడూ ఊహించి వుండలేదు.

దూరంగా పచ్చటి వెలుగు అలా ప్రసరిస్తూనే వుంది. వాళ్ళెంత దూరం నడిచినా ఆ వెలుగు కూడా అంత దూరం జరిగిపోతున్నట్టనిపిస్తోంది!

దీప్తి యింతలో కెవ్వున అరిచింది!

అందరూ తృళ్ళిపడి చూశారు.

ఆమె సన్నగా వణికిపోతోంది.

చేతో ఒకప్రక్క చూపించింది. అక్కడ ముగ్గురు వ్యక్తులు కళ్ళు తేలవేసి నాలుక బయటకు పెట్టి వికృతంగా చూస్తున్నట్టు కదలక మెదలక నించున్నారు.

వర్మ రివాల్వర్ గర్జించింది. లవుడు కుశుడు కూడా తుపాకులతో కాల్చారు. కాని ఆ వ్యక్తులు కిక్కురుమనలేదు. నేల వాలలేదు!

పరీక్షగా ఆ వ్యక్తుల్ని చూసిన కార్తీక్ బృందం అదిరిపడ్డారు.

"అందులో ఓ మనిషి మన భరణిలా వున్నాడు!" అని అరిచాడు కాత్రీక్.

"అవునవును, భరణే!" అన్నా రందరు.

వర్మ ఆశ్చర్యంగా చూశాడు.

"భరణెవరు?" అన్నాడు.

"మా డ్రయివరు. మాంత్రికుడి అనుచరుల చేతిలో చనిపోయాడు. ఇక్కడ ఎలా నిల్చుని వున్నాడో అర్థం కాలేదు!" అన్నారు అందరు.

వర్మ ఆ ముగ్గురు వ్యక్తులవైపు నడిచాడు. లవుడు, కుశుడు అతన్ని వెంటనంటి వున్నారు.

కాత్రీక్ బృందం వాళ్ళననుసరించారు.

ఆ ముగ్గురిలో ఒకడు భరణి, ఆ తక్కిన యిద్దరు మాంత్రికుడితోపాటు చచ్చినవాడి అనుచరులు!

వాళ్ళని గుర్తుపట్టి అందరు విస్మయంగా నిల్చుండి పోయారు.

చచ్చిన శవాలు ఎలా నించున్నాయి? అదీగాక గుహలో నేలమాళిగ మెట్లదగ్గరున్న శవాలు యిక్కడి కెలా వచ్చాయి? మాంత్రికుడి శవం ఏమయింది?

అన్నీ ప్రశ్నలే! జవాబురాని ప్రశ్నలు!

వర్మ ఆ ముగ్గుర్ని తోసి చూశాడు. వాళ్ళు కిందపడ లేదు. కర్రలా అలాగే బిగుసుకుపోయి నించున్నారు— చేతికి ఐస్ ముక్కల్లా తగిలారు.

వర్మ తల విదిలించాడు.

ఒకరి తర్వాత ఒకరు అందరూ ఆ శవాల్ని చుట్టుకుని తోసి చూశారు. ఒక్క అంగుళం కూడా ఆ శవాలు పక్కకి జరగ లేదు!

ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు!

ఎక్కడినుంచో వికృతమైన నవ్వు వినిపించింది.

అందరు అదిరిపడి చూశారు. ఎవరూ కనిపించలేదు. కాని గాలిలో అంతవరకు లేని అలజడి, యేవో వింత శబ్దాలు!

హిమవంత్ అర్ధవంతంగా వర్మకేసి చూశాడు.

వర్మ సాలోచనగా తలూపాడు.

"ఖచ్చితంగా అవి ప్రేతాత్మల చప్పుళ్ళే! క్షుద్ర దేవతల నారాధించేవాళ్ళు ప్రేతాత్మలతో యిలాంటి ప్రయోగాలు చేస్తారని మీరు వినలేదా?" అన్నాడు హిమవంత్, వర్మతో.

వర్మ తల విదిలించాడు. ఓటమి నొప్పుకోవటం ఇష్టం లేనట్టు గంభీరంగా తయారయింది అతని ముఖం!

కార్తీక్ బృందానికి చెమట్లు పోస్తున్నాయి. దీప్తి యింకా షాక్ నుంచి తేరుకున్నట్టు లేదు. వర్మ మాట విని తెలిసి తెలిసి ఈ మంత్రాల గుహలోకి మళ్ళీ ఎందుకు కాలు పెట్టామా అని బాధపడసాగారు.

వర్మ అందరివంకా పరిశీలనగా చూసి, "ఇది ఏదో చోటా మంత్రగాడి ప్రయోగం! మనం యిలాంటివాటిని లెక్క చేయనక్కర్లేదు — శవాల్ని నించో బెట్టడంలాంటి క్షుద్ర విద్యలు తెలిసినవాళ్ళు చాలామందున్నారు. వాళ్ళు బతికున్న మనుషుల్ని ఏమీ చెయ్యలేరు. అలాంటి వాళ్ళు మన ఎదరపడటానికూడా భయపడుంటారు...." అని అతనింకా ఏదో అంటుండగానే అతని చేతిలోని రివాల్వర్ అకస్మాత్తుగా గాల్లో ఎగిరింది.

వర్మ నిర్ఘాంతపోయి చూశాడు.

అప్పుడు కసుడు గాల్లో తుపాకీలు పేల్చారు.

వికృతమైన నవ్వు మరోసారి వాళ్ళ కర్ణపుటాల్ని

చీల్చుతూ వినిపించింది.

అందరు విస్మయంగా చూస్తూండగానే వర్మ రివాల్వర్ టప్‌మని నేలమీద పడింది.

"దయ్యాలు, మనకు కనిపించకుండా ఇక్కడ సంచరిస్తూండవచ్చు! వాటతో పేచీ పెట్టుకోవటం మంచిది కాదు. వర్మగారూ, వెనక్కి వెళ్ళిపోదామా?" అన్నాడు హిమవంత్.

వర్మ కోపంగా, ఉక్రోషంగా చూశాడతని వంక.

"డోంట్ బి ఫూలిష్! మరీ కాకమ్మ కథలు నమ్మటానికి మనం అజ్ఞానులం కాదు! యేదో చీప్ మంత్రగాడు కొన్ని క్షుద్ర విద్యలు నేర్చుకుని వాటిని మనమీద ప్రయోగిస్తున్నాడంతే! అలాంటి వాడికి జడిసి పారిపోతే అంతకన్న పిరికితనం, చిన్నతనం మరొకటి వుండదు! మనం ఎనిమిదిమంది వున్నాం. ఆమాత్రం వాళ్ళనెదిరించి పోరాడలేమా?" వర్మ మాటలకు అందరు మౌనం వహించారు.

ఇంతలో వాళ్ళపక్కగా ఎవరో నడుస్తూన్న సవ్వడి, గెంతుతున్న చప్పుళ్ళు వినిపించాయి. అందరు తమచుట్టు పరీక్షగా చూసుకున్నారు. కళ్ళకు ఎవరూ కనిపించటం లేదు! కాని ఎవరో తమ పక్కన అనుకుని తిరుగుతున్నట్టు చెవుల్లో ఏదో గుసగుస చెపుతున్న అనుభూతి!

అందరికీ గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. గాలి ఆడనట్టు, ఊపిరి తీసుకోవటం కష్టమైనట్టు, కదలలేనట్టు, మాట నోటినుండి రానట్టు రకరకాల అనుభూతులు వాళ్ళని కాసేపు తికమక పెట్టాయి!

ఎవరికి వారే ఆ విషయాలు తమ మనసులోనే దాచేసుకున్నారు. పైకి చెపితే వర్మ ఈసారి కొట్టేలాగా

వున్నాడు! చాలా కోపంగా కనిపిస్తున్నాడు.

"పదండి, ముందుకి నడవండి! ఈ ప్రేతాత్మల సంగతేమిటో యిప్పుడే తేల్చేద్దాం!" అన్నాడు వర్మ అతను కిందపడున్న తన రివాల్వర్ అందుకుని చేతపట్టుకున్నాడు.

రివాల్వర్ మీద వర్మ చేతులు గట్టిగా బిగుసుకుపోవటం చూసి వాళ్ళకు నవ్వొచ్చింది! మరోసారి రివాల్వర్ గాల్లోకి ఎగిరిపోతోందేమోనన్నట్టు బిగించి పట్టుకున్నాడు వర్మ! అంటే, అతను, మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నాడా? యేమో!?"

దీప్తి శివాలవంక చూడకుండా ముఖం పక్కకు తిప్పి వాళ్ళతో ముందుకు అడుగులు వేసింది.

* * *

పచ్చటి వెల్తురు దగ్గరయినట్టే అయి దూరంగానే వుండిపోయింది!

అందరు పక్కలకు చూసుకుంటూ నడుస్తున్నారు. పులిబోనులో తల పెడుతున్న ఫీలింగ్ అందరిలోనూ.

కార్తీక్ వాచీ చూసుకున్నాడు. పదిగంటలు చూపిస్తోంది! వర్మతో పెట్టుకోకుండా వుంటే ఆ పాటికి వేన్‌లో చింతపల్లె క్షేమంగా చేరుకుని వుండేవాళ్ళు! కాని వర్మ ఆపదల వలయంలోకి తమని తనతో బాటు తీసుకుపోతున్నాడు!

ఎవరూ మాట్లాడటంలేదు. మౌనంగా చూస్తున్నారు.

వర్మ ఆగిపోయాడు! అతని వెనక అందరూ అకస్మాత్తుగా ఆగిపోయారు. అందరు అతని కేదైనా దృశ్యం కనిపించిందేమోనని అటు చూశారు. ఎదురుగా విశాలమైన దారి తప్ప మరేం కనపడలేదు.

కార్తీక్ ప్రశ్నార్థకంగా చూశాడు వర్మవంక. వర్మ

తదేక దీక్షతో దారివైపే చూస్తున్నాడు. అతని చూపులు నిశ్చలంగా వున్నాయి! చేతిలో రివాల్వర్ గురిపెట్టి వుంది! అతనిలో ఎలాంటి కదలికా లేదు.

అందరికీ ఆశ్చర్యంగా వుంది.

కార్తీక్ చేత్తో వర్మను తట్టాడు—వర్మలో చలనం లేదు.

లవుడు, కుశుడు మొదటిసారిగా పెదవులు విప్పారు. "సార్, సార్!" అంటూ వర్మను తట్టి పిలిచారు.

వర్మ పలకలేదు! ఎవరికీ అతని పరిస్థితి అర్థంకాలేదు.

సరిగ్గా అదే సమయంలో అక్కడ పదిమంది వ్యక్తులు ఎక్కడినుంచో బిలబిలమంటూ వచ్చి వాళ్ళను చుట్టుముట్టేశారు. లవుడు, కుశుడు తుపాకులు కాల్చబోయారు కాని వాళ్ళ చేతులు అందుకు ఏమాత్రం సహకరించలేదు.

మాంత్రికుడి వచ్చిన అనుచరుల్లాగే ఆ పదిమందీ ఒంటికి విబూది పూసుకుని వున్నారు. నుదుట సింధూర బొట్లు వున్నాయి. మొలచుట్టూ జింక చర్మాలు కట్టుకున్నారు. అంతకుమించి వాళ్ళ శరీరంమీద మరెలాంటి ఆచ్ఛాదనా లేదు!

వాళ్ళ చేతుల్లో బలమైన తాళ్ళున్నాయి.

వర్మలో చలనంలేదు. అలాగే నించుని వుండి పోయాడు. అదే ఏస్థితో తెలీకుండా అలాగే వుండి పోయాడు.

పదిమందీ ముందుకొచ్చి నిల్చున్నారు. వాళ్ళముఖాల్లో ఎలాంటి భావమూ ద్యోతకం కావటంలేదు. కేవలం కీయిస్తే పనిచేసే మరబొమ్మల్లా వున్నారు.

కార్తీక్ బృందం అయిదుగుర్నీ, వర్మను, లవుడ్ని కుశుడ్ని తాళ్ళతో బంధించేశారు.

చిత్రంగా కార్తీక్ వాళ్ళు ఆ చర్యను ఎదుర్కోవా లనుకున్నా వాళ్ళ అవయవాలు అందుకు సహకరించ లేదు. తమ పరిస్థితికి చింతపడుతూ వాళ్ళు నిశ్చలంగా వుండిపోయారు.

* * *

వాళ్ళు పదిమందీ కార్తీక్ బృందాన్ని గొడ్లని లాక్కు పోయినట్టు ఓ రాతి గది దగ్గరకు లాక్కుపోయారు. బిలానికి మూత వేసిన రాతి పలకవంటి దానితో ఆ గది కట్టారు. అయితే యివి గుండ్రటి రాళ్ళుకాదు, చతు రస్రాకారంవే! వాటికి ఒకదానితో మరొకటి తాకించి గోడలుగా లేపారు.

అందర్నీ లాక్కుపోయి ఆ గదిలో పడేశారు. అదో బందిఖానాలాగా పోలీస్ స్టేషన్‌లో తాత్కాలికంగా నేరస్తుల్ని రిమాండులో పెట్టే సెల్‌లాగా వుందది. అందర్నీ అందులో పెట్టి, వాళ్ళు మౌనంగా వెళ్ళి పోయారు.

అప్పుడే మత్తు విడినట్టు వర్మ చటుక్కున కదిలి అందరివంకా చూశాడు.

"ఏమిటది? యెక్కడున్నాం?" అన్నాడు హడా వుడిగా.

లవుడు, కుశుడు మౌనంగా తమ యజమాని వంక చూసి కళ్ళతోటే మాట్లాడుతున్నారు.

కార్తీక్‌కి, అతని మిత్రులకి వర్మమీద చాలా కోపంగా వుంది. అయినా దాన్ని ప్రకటితంకాకుండా జాగ్రత్తపడ్డారు.

"మిస్టర్ కార్తీక్! ఏమిటిది? ఇలా బంధించా రెవరు మనల్ని?" అన్నాడు వర్మ.

కార్నర్ జరిగింది క్లుప్తంగా రెండు మాటల్లో చెప్పాడు.

వర్మ లవుడ్ని కుశుడ్ని కోపంగా తినేసేలా చూసి, "మీరిద్దరు నిద్రపోతున్నారా? మీ చేతుల్లో చేవ చచ్చిందా? కాల్చిపారెయ్యలేకపోయారా?" అన్నాడు.

"ఏం చెయ్యమంటారు సార్, మీకు పట్టిన గతే మాకూ పట్టింది. తుపాకులు కదల్చలేకపోయాం! మీరయితే మాటా పలుకు లేకుండా అలాగే నిల్చుండి పోతిరి!" అన్నాడు లవుడు.

వర్మ తల విదిలించాడు.

"నాకిప్పటికీ ఏమీ అర్థంకావటంలేదు. ఒక్కసారిగా నా నవనాడులు స్తంభించిపోయినట్టయింది. రివాల్వర్ వున్న చెయ్యి కదల్లేదు. మీ అందరు పిలవటం, నన్ను తాకటం, తట్టడం అన్నీ స్పృహలోకి వున్నాయి. కాని మీకు సమాధానం చెప్పటానికి నోరు రాలేదు. కనీసం ఆ వెధవలు నన్ను కట్టిపడేస్తూంటే కూడా ఎదిరించటానికి అవయవాలు స్వాధీనంలో లేవు!" వర్మ తన అనుభవాన్ని చెప్పుకొచ్చాడు.

"అంటే ఏదో ప్రేతాత్మ మిమ్మల్ని ఆవరించి వుంటుందా క్షణంలో! మీకు తెలియదుగాని వర్మగారూ, యీ ప్రేతాత్మలు చాలా గమ్మత్తులు చేస్తుంటాయండి. యేడిపించి తమాషా చూస్తుంటాయి. మీరు కొరివి దయ్యాలు అనే పేరు విన్నారా? ఇదిగో ఈ ప్రేతాత్మలు అదే 'లైపన్నమాట'! నేను ప్రేతాత్మలు గురించి-అదే స్పిరిట్సు అంటారింగ్లీషులో, చాలా డీటెయిలుగా చదివానో యింగ్లీషు పుస్తకంలో. ప్రస్తుతం ప్రేతాత్మలతో మనం సరాసరి మాట్లాడటానిక్కూడా పరిశోధనలు జరుగు

తున్నాయి. ప్రేతాత్మల మాటలు రికార్డు చేసుకోవచ్చునట టేపుమీద. ఇంకా యిలాంటి విషయాలెన్నో రాయబడున్నాయి ఆ పుస్తకంలో. ఈసారి మీకిస్తానుండండా పుస్తకం!" హిమవంత్ కళ్ళింత చేసుకుని చెప్తుంటే వర్మ చిరాగ్గా చూశాడు.

"నిజమే వర్మగారూ! స్పిరిట్సున్నాయి. ఇది అలాంటి స్పిరిట్సు పనే అయుండాలి! అయితే మనల్ని బంధించినది మాత్రం మాంత్రికుడి అనుచరులు. మనుషులే! యిలాంటి వాళ్ళని దారిలో—చచ్చి నించుని వున్న శవాల్ని మీరు చూశారుగా!" అన్నాడు కార్తీక్.

వర్మ సాలోచనగా చూశాడతనివంక.

"ప్రేతాత్మలకు మనతో ఏం పని?" అన్నాడు.

"ఈ భూగృహం బహుశా వాటి నివాస స్థానమై వుంటుంది. అందులోకి మనం ప్రవేశించటం వాటికి సుతారాము యిష్టంలేదు. అందుకే మనల్ని భయపెట్టి వెనక్కు పంపేయాలని చూసివుంటాయి. మనం వినలేదు!" అన్నాడు కార్తీక్.

"అంటే యిదివరకు ఊరి చివరి మర్రిచెట్టుమీద పిశాచాలు కాపురముండేవని చెప్పుకునేవారు చూడండి, అలా అన్నమాట!" హిమవంత్ వర్మని యెడ్యుకేట్ చెయ్యటానికి ప్రయత్నిస్తున్నాడు.

వర్మ అతనివంక కోపంగా చూసి, "మిష్టర్ హిమవంత్, నన్ను మరీ ఏమీ తెలియని అమాయకుడికింద జమకట్టొద్దు. నాకూ తెలుసు" అన్నాడు.

"అబ్బెబ్బె, నా ఉద్దేశం అదికాదు—మీకు స్పిరిట్సు పట్ల నమ్మకం కలిగిస్తున్నానంతే!"

(సశేషం)